క్లుప్తంగా

సీఎంను కలిసిన అప్సడా వైస్‌చైర్మన్ రఘురాం



సీఎంను కలిసిన అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆక్వా రైతుల కరెంటు సబ్సిడీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లకుకూడా సబ్సిడీ కల్పించినందుకు ఆక్వా రంగం తరపున, ఆక్వా రైతుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ



ప్రమాదంలో అద్దాలు పగిలిన బస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్ బోర్డు ఎస్‌వీఆర్ సర్కిల్ వద్ద జంగారెడ్డిగూడెం వెళ్లుతున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సును సోమవారం ఉదయం సెకండ్ ఫ్లైఓవర్ నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు అద్దాలు పగిలిపోయాయి. బస్సును వెంటనే డిపోకు చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

8న మండల పరిషత్ సమావేశం

పెంటపాడు: ఈనెల 8న ఉదయం 10 గంటలకు పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పక ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఈ తప్పు.. భావితరాలకు పెను ముప్పు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం





గూడెంలో అన్ని వస్తువులను ప్లాస్టిక్ బ్యాగులతో తీసుకెళుతున్న ప్రయాణికులు, పెంటపాడు డంపింగ్ యార్డులో చెత్తను కుప్పలుగా వేసిన దృశ్యం

పెంటపాడు: ఉదయం లేచింది మొదలు, టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరణా సామాన్లు...ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. అందుకే ఏఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. వాటిని నిర్లక్ష్యంగా ఆరు బయట పాడేస్తుండడంతో రోడ్లు, వీధులే కాదు ఆఖరికీ డ్రెయినేజీలు, వంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతోనే దర్శనమిస్తున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ చట్టం –2021 ప్రకారం 50మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితో నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా సంచులను తయారు చేయాలని, ప్రతి సంచిపై తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిబంధనలు పాటించని కంపెనీలకు, వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవేమీ అమలు కావడం లేదు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యమివ్వాలి

గూడెం నియోజకవర్గంలో టౌన్, పెంటపాడు, రూరల్ మండలాల్లో సుమారు 950 వరకు వివిధ దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసి పోవాలంటే వందలు, వేల ఏళ్లు పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. అటువంటి వాటితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాల్సిన అవసరముంది. ప్రజలు క్యారీ బ్యాగ్‌లకు జనపనార, క్లాత్ కాగితంతో తయారు చేసిన కవర్లను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుంది.

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ అతి వినియోగం పర్యావరణానికే కాదు, మానవాళి ఆరోగ్యానికి హానికరమే. ప్లాస్టిక్ నిషేదాన్ని సమాజిక బాధ్యతగా భావిస్తే కాలుష్యాన్ని అధికమించగలం. దీనిపై ప్రజలు చైతన్య వంతులు కావాలి

– డాక్టర్ పూజిత ముదునూరు పీహెచ్‌సీ

సహజ గుణాన్ని కోల్పోతున్న భూమి



పర్యావరణ కాలుష్యంతో భూమి నానాటికి సహజ గుణాన్ని కోల్పోతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ క్లాత్‌తో తయారు చేసిన సంచులు తీసుకెళితే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించొచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి

– ఎంపీపీ దాసరి హైమావతి పెంటపాడు

బీవీఆర్‌లో సంగీత, సాంస్కృతిక సమాహారం



బీవీఆర్‌లో కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రంలో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. బుద్దాల వెంకట రామారావు సభకు అధ్యక్షత వహించారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్, చిన్నారులచే నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత గురజాడ ఆనంద్‌కు గౌరవ పురస్కారం, నాట్య శిరోమణి పంతం శిరీషకు నాట్యరత్న పురస్కారం, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతికి సాహితీ రత్న పురస్కారం, మేకప్ ఆర్టిస్ట్ పరమేష్‌కు రూ. 51 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ఈతకోట తాతాజీ, లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, అంతర్జాతీయ శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, గమిని సుబ్బారావు, డైరెక్టర్ గునేశ్వరరావు, కళాకారులు, పట్టణ ప్రముఖులు, సాహితీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



తణుకు అర్బన్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజరు గిరిధర్‌కుమార్, తదితరులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): లక్కీ డ్రా తీస్తున్న డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమని తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. సోమవారం తణుకు ఆర్టీసీ డిపోలో టికెట్స్ డ్రాలో విజేతలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణాన్ని ప్రోత్సహించేందుకే లక్కీ డ్రా తీస్తున్నట్లు చెప్పారు. నరసాపురం రూట్‌లో పి.దుర్గ, పీజే కుమారి, రాజమండ్రి రూట్‌లో వై.ప్రమీల, పి.పెద్దిరాజు, భీమవరం రూట్‌లో బీవీఎస్ అప్పారావు, జి.పావని విజేతలు నిలిచినట్లు చెప్పారు. జనవరి 16వ తేదీన తీసిన డ్రా విజేతలకు షాలేం పెన్ కార్నర్ యాజమాన్యం సౌజన్యంతో బహుమతులను అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెన్న రమణమూర్తి, సీనియర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ తన్నీరు పున్నయ్య, జనరల్ ఏడీసీ రామకృష్ణ, ఏడీసీ రమణ, ఆర్‌కే రావు, ప్రయాణికులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని డిపోమేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. బస్సు కాంప్లెక్స్‌లో గిఫ్ట్ బాక్స్‌లో ప్రయాణీకులు వేసిన కూపన్‌లు ఆధారంగా సోమవారం లక్కీ డ్రా తీశారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లల్లో ప్రయాణం చేసిన వారి వివరాలు ఆధారంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

అత్తిలి: అత్తిలి తహసీల్దార్‌గా ఎ తాతారావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగల మండల తహసీల్దార్‌గా పనిచేసిన తాతారావు బదిలీపై అత్తిలికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఏవీ రామాంజనేయులు కృష్ణాజిల్లా గుడివాడకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తాతారావుకు గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

తణుకు తహసీల్దార్‌గా ముక్తేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు తహసీల్దార్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి బదిలీపై వచ్చి బీఎం ముక్తేశ్వరరావు సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకూ తణుకు తహసీల్దార్‌గా పని చేసిన పీఎన్‌డీ ప్రసాద్ కృష్ణా జిల్లా పెనుములూరుకు బదిలీపైవెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ముక్తేశ్వరరావుకు గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

'గూడెం' తహసీల్దార్‌గా మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల తహసీల్దార్‌గా బి.మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వ్యవహరించిన శివశంకర్ నుంచి మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈయన కైకలూరు నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మురళీకృష్ణకు రెవెన్యూసిబ్బంది స్వాగతం పలికారు.



అత్తిలి: తహసీల్దార్ తాతారావుకు అభినందనలు తెలుపుతున్న వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది



పెంటపాడు: తహసీల్దార్ సురేష్‌బాబును అభినందిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది

తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎం.విశ్వనాథ్ నందిగామ బదిలీకావడంతో ఆయన స్థానంలో సుబ్రహ్మణ్యం ఇక్కడకు వచ్చారు. ఈయన నందికొట్కూరు నుంచి బదిలీపై తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా వచ్చారు. ఆయనకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.



తాడేపల్లిగూడెం రూరల్: ఎస్.సుబ్రహ్మణ్యంకు అభినందనలు తెలుపుతున్న మండల పరిషత్ సిబ్బంది

మండల పరిషత్ ఏవో సుజాత, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సెక్రటరీలు ఆర్‌వీ.బ్రహ్మం, టి.రవిచంద్ర, బి.ఫణికుమార్, కే.శ్రీనివాసరెడ్డి, బిరుదుకోట రమేష్, వి.వాణి, సీహెచ్.చంద్రరాజు, బి.అప్పారావు, వై.హరికిషోర్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇరగవరం ఎంపీడీవోగా పద్మ జ్యోతి

ఇరగవరం: మండలం నూతన ఎంపీడీవోగా సోమవారం కె.పద్మజ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్నా ఎంపీడీవో ఎ శ్రీనివాస్ బదిలీ పై తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోకు అభినందనలు తెలిపారు.

పెంటపాడు తహసీల్దార్‌గా సురేష్‌బాబు

పెంటపాడు: పెంటపాడు మండల తహసీల్దార్‌గా ఎన్. సురేష్‌బాబు పదవీ బాధ్యతను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శేషగిరిరావు కృష్ణాజిల్లాకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌బాబుకు గ్రామ రెవెన్యూ అధికారులు, అభినందనలు తెలిపారు.

పోరాటాలు ఐక్యతను పెంచుతాయి



సమావేశంలో మాట్లాడుతున్న పీవీ ప్రతాప్

తణుకు: పోరాటాలు కార్మికులలో ఐక్యతను పెంచుతాయని సీఐటీయు జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. సోమవారం స్థానిక అమరవీరుల భవనంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సర్వసభ్య సమావేశం అచ్చి కృష్ణబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు రాష్ట్రంలో 16 రోజులు సమ్మె చేశారని ఆ సమ్మెలో అందరూ ఐక్యంగా తమ హక్కులను సాధించుకోవడం కోసం పోరాడారని అన్నారు. పోరాట ఫలితాలు అందరికీ సమానంగా ఉంటాయని అన్నారు. పాలకులు కార్మికుల పక్షానా పనిచేస్తే వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కామన మునిస్వామి, నీలపు ఆదినారాయణబాబు, ఎం.నాగేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పెంటపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

పెంటపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జట్లపాలెం గ్రామంలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కృష్ణంరాజు, ఆరోగ్య కార్యకర్తలు రమణ, మౌనిక, ఆశాలు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లోని పూడిక తొలగింపు



పాతూరు రైల్వే ట్రాక్ వద్ద డ్రెయినేజీల నుంచి పూడికలను తీస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లోని డ్రెయినేజీలు సిల్టుతో పూడుకుపోవడంతో మురుగునీరు ముందుకు పారడంలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్ ప్రధాన డ్రెయినేజీల నుంచి సిల్టును తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక పాతూరు రైల్వే ట్రాక్ వద్ద డ్రెయినేజీ నుంచి పూడిక తీసే పనులను సోమవారం చేపట్టారు. పూడిక తీయడంతో డ్రెయినేజీల్లో మురుగునీరు వేగంగా ముందుకు ప్రవహిస్తోంది.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత




మారంపల్లి గ్రామంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఉప సర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు అన్నారు. సోమవారం మండలంలోని మారంపల్లి నెం.1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో భేటీ బచావో... భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. తద్వారా జీవితంలో వారి కాళ్లపై వారు నిలబడటానికి అవకాశం ఉంటుందన్నారు. మాజీ సర్పంచ్ బలరాం గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహాలు చేయరాదన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సెక్రటరీ ఎస్‌కే.అహ్మద్, నాయకులు గెడ్డం మోషే, కల్లేపల్లి లక్ష్మీపతిరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు కే.బంగారం, టి.అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ఆర్‌డీఓ కార్యాలయం ఏఓ ఎల్.నరసింహారావు, ఎంపీడీఓ ఎస్.ఎస్.శర్మ, తాడేపల్లిగూడెం సీడీపీఓ టీఎల్ సరస్వతి, తణుకు సీడీపీఓ ఎన్‌వీఎస్ ప్రమోద్‌లు పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం డివిజనల్ స్థాయి బాల్య వివాహాలు నిరోధించుటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నరసింహారావు మాట్లాడుతూ బాల్య వివాహాల రేటు 29.3 శాతంగా ఉందని దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో నిలిచిందని చెప్పారు. బాల్య వివాహాలను నిలుపుదల చేసేందుకు సహకరించాలని, ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక బోధనాంశాలను ఉపాధ్యాయులు పెంపొందించుకోవాలి



తణుకులో ఐసీటీ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో హైమావతి

తణుకు అర్బన్: నేటి ఆధునిక కాలంలో విద్యావ్యవస్థలో వస్తున్న అధునాతన సాంకేతికతను, సమాచారాన్ని అందిపుచ్చుకోవడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐసీటీ ఇన్‌చార్జ్, తణుకు మండల విద్యాశాఖాధికారి వి.హైమావతి అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న సమాచార సాంకేతిక నైపుణ్యాలపై (ఐసీటీ) తణుకు డివిజన్ పరిధిలో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల ఉపాధ్యా యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సౌకార్యార్థం విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఈ శిక్షణ కార్యక్రమంలో తరగతి గదిలో విద్యార్థులకు సాంకేతికంగా బోధించే విధానాలను ఉపాధ్యాయులు ఒంటబట్టించుకోవాలని సూచించారు. ఐసీటీ శిక్షణా కేంద్ర కోఆర్డినేటర్, జెడ్పీ బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం కె.పద్మావతి మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో కంప్యూటర్ అనుకరణాలు, డిజిటల్ బోర్డుల అనుసంధానంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్‌గా డి.మాధవిలత, డి.మల్లిఖార్జునరావు, ఎ.రాంబాబు, వరప్రకాష్ శేఖర్, భూషణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ ఈ క్రాప్ చేయించుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి రైతూ ఈ క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో కడియద్ద, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టెంపాలెం గ్రామాల్లో సోమవారం జిల్లా అధికారితో పాటు ఏడీఏ మురళీకృష్ణ, ఏఓ ప్రసాద్‌లు పర్యటించారు. పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 15 లోపు ఈ క్రాప్ , ఈకేవైసీ ప్రతి రైతు చేయించుకోవాలని కోరారు. ఫిబ్రవరి 21 నుంచి 28 వరకు ఆర్‌బీకేల్లో ఈ క్రాఫ్ లిస్టులు సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. మార్చి 1 నుంచి 4 వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి మార్చి 6న తుది జాబితాను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇంచార్జ్‌లు వీర్రాజు, వంశీ, ధర్మరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● తణుకులో హిమ ప్రతాపం



తణుకు జాతీయ రహదారిపై కమ్మేసిన పొగమంచు



తణుకు పట్టణంలో ఉదయం 8 గంటలకు ఇదీ పరిస్థితి

మంచు ముంచుతోంది. సంక్రాంతి ముగిశాక చలి తగ్గాల్సి ఉన్న ఇంకా పెరిగిపోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరీ ముఖ్యంగా వేకువ జామున రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. హిమసోయగం... మధ్యాహ్నం సూర్యతాపం.. ఇదీ తణుకులో సోమవారం నెలకొన్న విచిత్ర పరిస్థితి. వారం రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తున్నాయి. అకస్మాత్తుగా సోమవారం ఉదయం తణుకు వణికిపోయింది. పట్టణాన్ని పొగ మంచు కప్పేసింది. పొగమంచు కారణంగా ఉదయం జనజీవనం స్తంభించిపోయింది. జాతీయ రహదారిపై సైతం వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కనీసం 10 అడుగుల దూరంలో సైతం వాహనాలు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదయం 9 గంటల వరకూ ఇదే పరిస్థితి. మధ్యాహ్నం యథావిధిగా దినకరుడు తన ప్రతాపం చూపాడు. ఇదేమి ప్రకృతి మహిమో..! అంటూ స్థానికులు నోరెళ్లబెట్టారు. - తణుకు